సాక్షి
నాగర్‌కర్నూల్
ఆదివారం । 7 । జూలై । 2024



కోనేరు పూడ్చివేతపై ఆగ్రహం
బాదేపల్లి పెద్దగుట్టపై ఉన్న కోనేరు పూడ్చివేతపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
వివరాలు 8లో ▸



ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నీ
పాలమూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ముగిశాయి.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.4 /23.7
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీస్తాయి. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శనేశ్వరాలయానికి భక్తుల తాకిడి



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌కి చెందిన జైష్టాదేవి సమేత శనేశ్వరాలయానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తుల తాకిడి పెరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి భక్తులతో శనేశ్వరుడికి తిలతైలాభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్థానిక శివాలయంలో బ్రహ్మసూత్ర పరమ శివుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కుల వ్యవస్థ నిర్మూలనకు కృషి



అచ్చంపేట రూరల్: సమాజంలో నిమ్న జాతులను అణచివేసేందుకు ఆయుధంగా ఉన్న మనుధర్మ శాస్త్రం, కుల సమస్య, దేశంలో నిర్మూలన జరగాల్సిన అవసరం ఉందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ అన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే జిల్లా స్థాయి సామాజిక శిక్షణా తరగతులను అచ్చంపేటలోని జగ్జీవన్‌రాం భవనంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో 6,486 కులాలు మరో 28 వేల ఉప కులాలు ఉన్నాయని తెలిపారు. తరతరాలుగా వస్తున్న మనుధర్మ శాస్త్రం ఆధారంగా మనిషిని మనిషిగా చూసే పరిస్థితి నేడు లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నేడు ఎక్కడ చూసినా.. కులం పేరట దౌర్జన్యాలు పెరిగి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలంటే దేశంలో కుల వ్యవస్థ నిర్మూలించాలన్నారు. వసతిగృహాలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, ప్రధాన కార్యదర్శి పరశురాములు, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్, దేశ్యనాయక్, శంకర్‌నాయక్, సైదులు పాల్గొన్నారు.

వారం రోజులు జిల్లాలో స్పెషల్ డ్రైవ్

నాగర్‌కర్నూల్ క్రైం: మోటారు వాహన చట్టాల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 22 పోలీస్‌స్టేషన్ల పరిధిలో వారం రోజుల పాటు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. తనిఖీల్లో నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడిపే వారి వాహనాలను, మైనర్ డ్రైవింగ్ చేసే వాహనాలను, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు శిక్షా అర్హులు అవుతారని, మద్యం తాగి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు కారణమైతే కుటుంబం అనాథగా మారుతుందన్నారు.

సీఎం ఓవర్‌సిస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు

నాగర్‌కర్నూల్ రూరల్: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే మైనార్టీ విద్యార్థులకు, సీఎం విదేశీ విద్యా పథకం కింద లబ్ధిపొందేందుకు, దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి ఎస్.గోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. డిగ్రీలో 60 శాతం మార్కులు పొంది పోస్ట్ గ్రాడియేషన్ విద్య అభ్యసించదలచిన వారు, పీజీలో 60 శాతం మార్కులు వచ్చి పీహెచ్‌డీ చేయాలనుకునే విద్యార్థులు ఈ పథకానికి అర్హులని తెలియజేశారు. 2024 జనవరి నుంచి జూలై 31 వరకు ఎంపికైన విద్యా యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొంది ఉండాలన్నారు. విద్యార్థులు ధ్రువపత్రాలను ఆన్‌లైన్ లేదా పోస్టర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ధ్రువపత్రాలపై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి ఐడీ యుక్తంగా ఈ నెల 8 నుంచి కలెక్టర్ కార్యాలయంలోని మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

ఐటీఐ కళాశాలలో ..

కల్వకుర్తి రూరల్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ లక్ష్మణస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 4 నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 8, 10 తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ దరఖాస్తులకు అర్హులన్నారు. అన్ని ధ్రువీకరణ పత్రాలతో ITItelanganagov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఎక్కువ ట్రేడ్‌లో ఆప్షన్స్ పెట్టుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మణస్వామి తెలియజేశారు.

అప్రమత్తతే కీలకం..

జంతువుల నుంచి మానవులకు సంక్రమిత వ్యాధుల ముప్పు

- పెంపుడు జంతువుల యజమానులు జాగ్రత్తలు పాటించాలి
- పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ డోస్ తప్పనిసరి
- 'సాక్షి'తో జిల్లా వెటర్నరీ అధికారి రమేశ్
- శనివారం జూనోసిస్ డే సందర్భంగా పశు సంవర్ధక శాఖ, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్



సాక్షి, నాగర్‌కర్నూల్: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జీవీ రమేశ్ అన్నారు. అప్రమత్తంగా ఉంటే రేబిస్ వంటి జూనోటిక్ వ్యాధుల నుంచి ప్రమాదాన్ని తప్పించుకోవచ్చని చెప్పారు. శనివారం జూనోసిస్ డే సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి జిల్లా కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ముందస్తు వాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. పెంపుడు శునకాలకు, వాటి యజమానులు, పోలీస్ జాగిలాల సిబ్బంది, వెటర్నరీ సిబ్బందికి ముందస్తు యాంటీ రేబిస్ వాక్సిన్ డోస్‌ను అందించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో పలు విషయాలను పంచుకున్నారు.

వీధి కుక్కలతో ప్రమాదం..

కుక్కలు, కోతులు, పిల్లులు కరవడంతో మనుషులకు రేబిస్ వ్యాధి సంక్రమిస్తుంది. చిన్నారుల్లో కొన్నిసార్లు ఇది ప్రాణాంతకంగా పరిణమిస్తుంది. వీధి కుక్కలు కాటువేస్తే రేబిస్ సంక్రమణకు దారి తీస్తుంది. మనుషులపై కుక్కలు దాడి చేసినప్పుడు కుక్కకాటు మెదడు, తల భాగానికి దగ్గరగా ఉంటే రేబిస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కాళ్లు, చేతులకు గాయాలైతే రేబిస్ ఇన్‌ఫెక్షన్ తక్కువగా ఉండే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా 6 వేల వరకు పెంపుడు జంతువులు ఉండగా.. వీటికి వ్యాక్సిన్ ఇచ్చేలా యాజమానులకు అవగాహన కల్పిస్తున్నాం. పెంపుడు జంతువుల యజమానులు, డాగ్‌స్క్వాడ్ పోలీస్ సిబ్బంది, వెటర్నరీ సిబ్బందికి ముందస్తు రేబిస్ వ్యాక్సిన్‌ను అందజేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా సుమారు 25 వేలకు పైగా వీధికుక్కలు ఉన్నాయి. వీధి కుక్కలను సంబంధిత స్థానిక సంస్థల సిబ్బంది ఎనిమల్ కేర్ సెంటర్‌కు తరలించాల్సి ఉంటుంది.

వాక్సిన్ తప్పనిసరి..

పెంపుడు జంతువులతో మనుషులకు అవినాభావమైన సంబంధం ఉంటుంది. వాటితో అనునిత్యం ఆనందంగా గడపడంతో పాటు వాటి నుంచి సంక్రమించే వ్యాధులపై సైతం అప్రమత్తత కలిగి ఉండాలి. పెంపుడు జంతువుల నుంచి రేబిస్, మెదడు వాపు, బ్రూసెల్లా, టీనియాసిస్, టీబీ, ఆంత్రాక్స్ తదితర వందకు పైగా జూనోటిక్ వ్యాధులు మనుషులకు సంక్రమించే ప్రమాదం పొంచి ఉంది. జూనోటిక్ వ్యాధుల నిర్మూలనకు ప్రధానంగా పెంపుడు జంతువులకు ఏడాదికి ఒకసారి విధిగా వ్యాక్సిన్ వేయించాలి. జాతీయ రేబిస్ నిర్మూలన కార్యక్రమం కింద జిల్లాలోని పెంపుడు జంతువులకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) అందిస్తున్నాం. పెంపుడు జంతువుల యజమానులకు సైతం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ముందస్తు ఏఆర్‌వీ వ్యాక్సిన్ అందిస్తున్నాం. వ్యాక్సినేషన్ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ కోసం పశు వైద్యశాలల్లో, పెంపుడు జంతువుల యజమానులు ప్రభుత్వ ఆస్పత్రిలో వ్యాక్సిన్ తీసుకోవాలి. జిల్లాలోని 34 పశువైద్యశాలల్లో పెంపుడు జంతువుల కోసం ఏఆర్‌వీ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాం.



పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వాక్సిన్ ఇస్తున్న వెటర్నరీ అధికారి రమేష్ తదితరులు

అవగాహన కరువు..

జూనోసిస్ వ్యాధుల్లో 200 రకాలు ఉన్నట్లు గుర్తించగా.. మొత్తం అంటువ్యాధుల్లో ఇవే 60 శాతమని తెలుస్తోంది. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జూనోసిస్ వ్యాధులపై అవగాహన కల్పించాల్సి ఉండగా.. నిర్లక్ష్యం చేస్తున్నారు. శనివారం జూనోసిస్ డే ఉన్నా.. అచ్చంపేట మున్సిపాలిటీ అధికారులు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదు.

అందుబాటులో వ్యాక్సిన్..



రేబిస్ వ్యాధి నివారణకు సంబంధించిన వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ప్రతి రోజు 5 నుంచి 10 కుక్కలను పెంపకందారులు తీసుకొస్తున్నారు. వాటికి వ్యాక్సిన్ వేస్తున్నాం. పిల్లులను నెలకు 10వరకు తీసుకొస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే జంతు ప్రేమికులకు అవగాహన కల్పిస్తున్నాం.

– లక్ష్మి, వెటర్నరీ అసిస్టెంట్, అచ్చంపేట

రోగనిరోధక శక్తి పెంపు..

భూమి మీద పుట్టిన ప్రతి జీవికి వ్యాక్సినేషన్ తప్పనిసరి అని జిల్లా వెటర్నరీ అధికారి రమేష్, జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్ అన్నారు. జంతువైనా, మనిషికైనా వ్యాక్సినేషన్ చేయించుకుంటేనే రోగాల నుంచి అధిగమించవచ్చని తెలియజేశారు. శనివారం స్థానిక వెటర్నరీ జిల్లా కార్యాలయ ఆవరణలో వ్యాక్సినేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి జీవికి వ్యాక్సినేషన్ చేయించుకున్నప్పుడే రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని తెలియజేశారు. 30 ఏళ్లుగా వ్యాక్సినేషన్ దినోత్సవాన్ని కొనసాగిస్తున్నట్లు వివరించారు.

నీచ రాజకీయాలు చేసింది బీఆర్‌ఎస్సే



రాయలగండి క్షేత్రంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, మేఘారెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తదితరులు

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై ధ్వజమెత్తిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

అచ్చంపేట రూరల్/ అమ్రాబాద్: కాంగ్రెస్ పార్టీపై నిందలు వేసి అప్రతిష్ట, అభాసుపాలు చేయడానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పూనుకున్నాడని, రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ఇద్దరు సీఎంలు మాట్లాడుకోవడం తప్పా అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, మేఘారెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం అచ్చంపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నో అక్రమాలు, కబ్జాలు చేసిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. అన్ని ఆధారాలను ఏసీబీ, సీబీఐ, సీఐడీకి అందించి మాజీ మంత్రి చిట్టా విప్పుతామన్నారు. బినామీల పేర్లతో ఆస్తులను కూడగట్టుకున్నాడని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులను పార్టీలో చేర్చుకుని రాజకీయ వ్యభిచారం చేసిందెవరో రాష్ట్ర ప్రజలకు తెలుసు అన్నారు. నీచ రాజకీయాలు చేసిందే కేసీఆర్ అని, మంత్రిగా, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఉండి జిల్లాకు నిరంజన్‌రెడ్డి ఏం చేశారని నిలదీశారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే మాజీ సీఎం కేసీఆర్ అని, బీఆర్‌ఎస్ దుకాణం బంద్ కావడం, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు దోచుకున్నదెవరో వనపర్తిలోని రాజీవ్‌చౌక్‌కు వస్తే నిరూపిస్తామని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సవాల్ విసిరారు. కాలం చెల్లిన పార్టీ బీఆర్‌ఎస్ అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శించారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. గతంలో ఏపీ, తెలంగాణ సీఎంలు చీకటి ఒప్పందాలు చేసుకున్నది వాస్తవం కాదా..? అని ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్ ప్రశ్నించారు.

నల్లమలలో రెండోరోజు స్టడీ టూర్

సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నల్లమలను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ పునరుద్ఘాటించారు. నల్లమల స్టడీ టూర్‌లో భాగంగా శనివారం రెండోరోజు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేల బృందం ముందుగా పదర మండలం రాయలగండి క్షేత్రం మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు. అంతకు ముందు ఆలయాల వద్ద అర్చకులు, అధికారులు ఎమ్మెల్యేలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. వారి వెంట యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున్, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు అనంతరెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రమోహన్, రమేష్‌రెడ్డి, రామలింగయ్యయాదవ్ తదితరులున్నారు.

మాదకద్రవ్యాలు వాడకంతో తీవ్ర దుష్ప్రభావం



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి రాజేష్‌బాబు

నాగర్‌కర్నూల్ క్రైం: మాదకద్రవ్యాల వాడకంతో మనిషి జీవన విధానంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుందని జిల్లా న్యాయమూర్తి రాజేష్‌బాబు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మాదకద్రవ్యాల వాడకంతో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడారు. మాదకద్రవ్యాల వాడకంతో నాడీ వ్యవస్థ దెబ్బతింటుందని అన్నారు. చెడు అలవాట్లకు బానిసై అసాంఘిక కార్యక్రమాలకు అలవాటుపడుతారని అన్నారు. ఎవరైనా మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చేరే జూనియర్ విద్యార్థులను, సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్షకు గురవుతారని, ర్యాగింగ్ చట్టరీత్యా నేరమన్నారు.

'చేతి'కి చిక్కిన అచ్చంపేట



నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లతో ఎమ్మెల్యే వంశీకృష్ణ

- మున్సిపల్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీనివాసులు
- ఓటింగ్‌కు హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ
- బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు గైర్హాజరు



గార్లపాటి శ్రీనివాసులు

అచ్చంపేట: అచ్చంపేట మున్సిపల్ చైర్మన్‌గా 14వ వార్డు కౌన్సిలర్ గార్లపాటి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఉదయం 10.50గంటలకు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎమ్మెల్యే డాక్టరు చిక్కుడు వంశీకృష్ణతో కలిసి మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక కోసం ఆర్డీఓ మాధవిని ఎన్నికల అధికారిగా నియమించారు. మున్సిపల్ సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు చైర్మన్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించగా.. చైర్మన్‌గా గార్లపాటి శ్రీనివాసులు పేరును 1వ వార్డు కౌన్సిలర్ గౌరిశంకర్ ప్రతిపాదించగా.. 14 మంది కౌన్సిలర్లు, ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతులెత్తి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మాధవి ప్రకటించారు. అనంతరం చైర్మన్‌గా ఎన్నికైనట్లు ధ్రువపత్రం అందజేసి.. ప్రమాణ స్వీకారం చేయించారు. అచ్చంపేట మున్సిపాలిటీలో మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉండగా.. కాంగ్రెస్ పార్టీకి చెందిన 14 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ఎడ్ల నర్సింహగౌడ్, మన్నుప్రసాద్, సిరసనగండ్ల రమేష్‌రావు, ఖాజాబీ అదే విధంగా అవిశ్వాసానికి మద్దతు తెలిపిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ అంతటి శివ, బీజేపీకి చెందిన సుగుణమ్మ గైర్హాజరయ్యారు. చైర్మన్‌గా ఎన్నికైన గార్లపాటి శ్రీనివాసులుకు ఎమ్మెల్యే వంశీకృష్ణ స్వీట్లు తినిపించి శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం తోటి మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, వ్యాపార, వర్తక సంఘాలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. అనంతరం చైర్మన్ మాట్లాడారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ కృషి, సహకారంతో ఈ పదవి దక్కిందని, అకింతభావంతో పనిచేసి అచ్చంపేట మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కౌన్సిలర్లు, పాలకవర్గం సమష్టి నిర్ణయాలతో పట్టణాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. పట్టణ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేసేందుకు ప్రతిఒక్కరి సహాయ, సహకారాలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, ఆడిపాల గోపాల్‌రెడ్డి, సూరం రమేష్‌రెడ్డి, కపిలవాయి చంద్రమోహన్, కటకం రఘురాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణే ముఖ్యం

బిజినేపల్లి: ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు క్రమశిక్షణే ముఖ్యమని, వారికి క్రమశిక్షణ అలవడితే విద్యలో కూడా రాణిస్తారని డీఈఓ గోవిందరాజులు అన్నారు. శనివారం తిమ్మాజీపేట, బిజినేపల్లి మండలాల పరిధిలోని మరికల్, గుమ్మకొండ, యూపీఎస్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు.



తిమ్మాజీపేట మండలంలోని మరికల్‌కి చెందిన పాఠశాలలో డీఈఓ గోవిందరాజులు

బీఆర్‌ఎస్‌కు షాక్

'చేయి' అందుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల

- హస్తం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం
- నడిగడ్డ రాజకీయాల్లో కీలక మలుపు
- పాలమూరులో 13కు పెరిగిన కాంగ్రెస్ బలం
- ఎమ్మెల్యేల్లో 'గులాబీ'కి మిగిలింది ఒకేఒక్కడు
- కృష్ణమోహన్‌రెడ్డి చేరిక కార్యక్రమానికి సరిత దూరం
- సముచిత స్థానం కల్పిస్తామని పెద్దల సముదాయింపు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పాలమూరులో భారత రాష్ట్ర సమితికి షాక్ తగిలింది. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కారు దిగి చేయి అందుకున్నారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో శనివారం జరిగిన కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరారు. ఉమ్మడి పాలమూరులో మొత్తం 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో 12 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. గద్వాల, అలంపూర్‌లో బీఆర్‌ఎస్‌కు చెందిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు విజయం సాధించారు. తాజాగా గద్వాల ఎమ్మెల్యే హస్తం గూటికి చేరిన నేపథ్యంలో ఆ పార్టీ బలం 13కు పెరగగా.. బీఆర్‌ఎస్‌కు బలం ఒకటికి పడిపోయింది.

పునర్ వైభవం దిశగా..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గద్వాల నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిచిన విషయం తెలిసిందే. దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గద్వాల నుంచి ప్రాతినిధ్యం వహించిన డీకే అరుణ మంత్రి పదవి చేపట్టారు. తదనంతరం రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్‌లో సైతం ఆమె మంత్రిగా ఉన్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో డీకే అరుణ కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల క్రమంలో డీకే అరుణ బీజేపీలో చేరగా.. హస్తం డీలా పడింది. 2018 ఆ తర్వాత 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ సాధించి అధికారంలోకి వచ్చినప్పటికీ గద్వాలను చేజార్చుకోవడంపై కాంగ్రెస్ పెద్దలను నిరాశకు గురిచేసింది. ఈ క్రమంలో పునరైవభవం సాధించే దిశగాఆ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపడం.. సీఎం రేవంత్‌తో పాటు మంత్రి జూపల్లి చక్రం తిప్పడంతో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ చేరారు. ఈ పరిణామంతో నడిగడ్డ రాజకీయాలు కీలక మలుపు తీసుకోనున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

దగ్గరగానే ఉన్నా.. దూరంగా సరిత

కాంగ్రెస్‌లో బండ్ల చేరికకు ముందు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నట్లు ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ జోరుగా సాగుతోంది. కృష్ణమోహన్‌రెడ్డి చేరికను వ్యతిరేకిస్తూ మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత వర్గీయులు గురు, శుక్రవారాల్లో ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో పాటు ఆమె ఎంపీ మల్లు రవితో భేటీ అయింది. ఈ సందర్భంగా తన గోడును వెళ్లబోసుకుంది. తాజాగా శనివారం బండ్ల చేరిక కార్యక్రమానికి ముందు ఒకరిద్దరు పెద్దలను కలిసి సైతం బండ్లను చేర్చుకోవద్దని కోరినట్లు సమాచారం. ఈ క్రమంలో సీఎం రేవంత్‌ను కలవగా ఆయన సరితను సముదాయించినట్లు వినికిడి. పార్టీ బలోపేతం దిశగా తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాలని.. ఇబ్బంది లేకుండా సముచిత స్థానం కల్పిస్తామని చెప్పినట్లు తెలిసింది. ఆ తర్వాత బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆ సమయంలో సరిత సీఎం నివాసంలోనే ఉన్నా.. ఈ కార్యక్రమంలో పాల్గొనలేదు. అక్కడ ఉన్న కొందరు నేతలు పిలిచినప్పటికి రాలేదని తెలుస్తోంది.

నష్టనివారణపై బీఆర్‌ఎస్ దృష్టి.. ఆంజనేయగౌడ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ?

గద్వాల ఎమ్మెల్యే బీఆర్‌ఎస్‌ను వీడిన క్రమంలో ఆ పార్టీ పెద్దలు నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నేతలకు ఫోన్లు చేసి పార్టీలోనే ఉండాలని.. అండగా ఉంటామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే గులాబీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, కృష్ణమోహన్‌రెడ్డి అభిమానులు పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరేందుకు సమాయత్తమైనట్లు తెలుస్తోంది. గద్వాలలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవానికి త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ హాజరుకానుండగా.. భారీ బహిరంగ సభ నిర్వహించేలా కసరత్తు చేస్తున్నారు. ఇదే రోజు ముఖ్య నేతలందరూ కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. కాగా గద్వాల రాజకీయాలపై దృష్టి సారించిన బీఆర్‌ఎస్ పెద్దలు నష్ట నివారణకు కసరత్తు చేపట్టినట్లు ఆ పార్టీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయ గౌడ్ గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌కు పోటీ పడిన విషయం తెలిసిందే. ఆయనకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి.. పార్టీ శ్రేణులను కాపాడుకునే దిశగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం.

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు | వివరాలు 8లో ▸ | మన్ననూర్‌లో ఆర్‌సీఓ కార్యాలయం

క్లుప్తంగా

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య


చంద్రయ్య (ఫైల్)

వెల్దండ: మండలంలోని చెర్కూర్ చెందిన గొడుగు చంద్రయ్య (42) శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకున్నాడు. ఏఎస్ఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రయ్య అన్నదమ్ములకు ఉన్న భూమిలో భాగపరిష్కారంలో మనస్పార్థాలు రావడంతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య అలివేలు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొత్తచట్టంలో భారతీయ నగరిక్ సురక్ష సంహిత మొదటి కేసుగా నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..


తిరుపతయ్య (ఫైల్)

అడ్డాకుల: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంంలోని కందూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జక్కుల తిరుపతయ్య(42) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నాళ్ల నుంచి ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురయ్యాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంటి వద్ద ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

వృద్ధుడి దుర్మరణం

భూత్పూర్: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన భూత్పూర్ మండలం పోతులమడుగు సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. శేరిపల్లి(హెచ్) గ్రామానికి చెందిన రాములు (70) భార్య ఆరేళ్ల క్రితం మృతిచెందింది. నాటి నుంచి మతిస్థిమితం కోల్పోయిన అతడు.. శనివారం తెల్లవారుజామున భూత్పూర్ వైపు నడుచుకుంటూ వస్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహంపై నుంచి వాహనాలు వెళ్లడంతో నుజ్జునుజ్జయ్యింది. మృతుడి కుమారుడు మునయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మన్ననూర్‌లో ఆర్‌సీఓ కార్యాలయం

మన్ననూర్: గిరిజన గురుకులాల రివిజనల్ కోఆర్డినేట్ ఆఫీసర్ (ఆర్‌సీఓ) అధికారిక కార్యాలయాన్ని మన్ననూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేస్తున్నట్లు ఐటీడీఏ కార్యాలయ వర్గాలు శనివారం ప్రకటనలో తెలిపాయి. గతంలో ఈ కార్యాలయాన్ని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి తరలించారు. మన్ననూర్‌లోని ఐటీడీఏ పరిధిలో ఉంటేనే ఉమ్మడి జిల్లాలో 10 గురుకులాలకు అందుబాటులో ఉంటుంది. గత నెలలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మన్ననూర్‌ను సందర్శించినప్పుడు ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ రోహిత్ రెడ్డి విషయాన్ని దృష్టికి తీసుకెళ్లారు. విచారణ చేసి కార్యాలయంను మన్ననూర్‌కు తీసుకు రావాలని ఆదేశాలు జారీ చేశారు. శనివారం నుంచి అందుకు సంబంధించిన కార్యకలాపాలు జరుగుతాయని తెలియజేశారు. ఆర్‌సీఓగా నాగార్జున కొనసాగుతున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

సింగిల్స్ విభాగంలో సత్తా చాటిన అజయ్‌కార్తీక్, ప్రసన్నబోనం

- డబుల్స్ విజేతలు నవనీత్, వెంకటమౌనిష్
- మిక్స్‌డ్ డబుల్స్‌లో అన్నాచెల్లిదే టైటిల్
- ట్రోఫీలు అందజేసిన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


విజేతలతో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న 10వ రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్–19) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఉత్సాహంగా ముగిసింది. చివరి రోజు శనివారం ఆయా విభాగాల ఫైనల్స్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. సింగిల్స్ విభాగంలో ఎం.అజయ్‌కార్తీక్ (జనగాం), ప్రసన్నబోనం (ఖమ్మం) సత్తా చాటి చాంపియన్లుగా నిలిచారు. బాలుర విభాగం ఫైనల్‌లో అజయ్‌కార్తీక్ 21–16, 21–26 వరుస సెట్ల తేడాతో అక్షిత్ వలిశెట్టి (మెదక్)పై విజయం సాధించగా.. బాలికల మ్యాచ్‌లో ప్రసన్నబోనం 21–12, 23–21 తేడాతో శ్రేష్టారెడ్డి (హైదరాబాద్)పై గెలుపొందింది.

అంతర్జాతీయ ప్రమాణాలతో ఇండోర్ స్టేడియం..

బీఆర్ఎస్ ప్రభుత్వంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఇండోర్ స్టేడియం నిర్మించినట్లు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గతంలో జిల్లాస్థాయి టోర్నీ నిర్వహించేందుకు సైతం సరైన వసతులు ఉండేవి కాదని గుర్తుచేశారు. క్రీడల్లో రాజకీయాలకు తావు ఉండకూడదని.. తాను క్రీడాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు క్రీడాపోటీలకు అన్ని పార్టీల ప్రజాప్రతినిధులను ఆహ్వానించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే పీఏ ఫోన్‌చేసి మాజీ మంత్రి ఫొటో ఉండకూడదని, ఫ్లెక్సీని తీసివేయమని చెప్పినట్లు పలువురు తనతో చెప్పారన్నారు. బ్యానర్లు, శిలాఫలకాలు తీసివేయవచ్చేమో కాని, ప్రజల గుండెల్లో తమను తొలగించలేరని అన్నారు. రాష్ట్రస్థాయి క్రీడలు ఉన్నప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం..

క్రీడల్లో గెలుపోటములు సహజమని.. క్రీడాస్ఫూర్తితో ఆడాలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. క్రీడల్లో ఓడిన వారు మళ్లీ గెలుపు కోసం శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ కోశాధికారి వంశీచంద్, టోర్నీ చీఫ్ రెఫరీ హన్మంతురావు, పరిశీలకుడు రంగారెడ్డి, ఎండీబీఏ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాం సుందర్‌గౌడ్, రవికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్, విజయ్‌రెడ్డి, ఉదయ్, రాజశేఖర్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింలు, మాజీ వైస్‌చైర్మన్ గణేష్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, కౌన్సిలర్ రామ్, నవకాంత్ పాల్గొన్నారు.


డబుల్స్ బాలుర విభాగం ఫైనల్ మ్యాచ్ ఆడుతున్న క్రీడాకారులు

హోరాహోరీగా డబుల్స్ మ్యాచ్‌లు..

డబుల్స్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. బాలుర మ్యాచ్‌లో ఎం.నవనీత్ (రంగారెడ్డి) – వెంకట మౌనిష్ (మెదక్) 22–24, 22–20, 22–20 తేడాతో అక్షిత్ వలిశెట్టి (మెదక్)–పులపాటి జైనేష్‌రెడ్డి (హైదరాబాద్)పై విజయం సాధించా రు. బాలికల మ్యాచ్‌లో అలీషాఖాన్ (రంగారెడ్డి) –శ్రేష్టారెడ్డి (హైదరాబాద్) 21–16, 21–11 తేడాతో కె.సమీక్షారెడ్డి (హైదరాబాద్)–పూజిత నీలికంఠి (రంగారెడ్డి)పై గెలుపొంది విజేతగా నిలిచారు.

■ మిక్స్‌డ్ డబుల్స్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో అన్నాచెల్లెలు ఎం.అజయ్‌కార్తీక్ – ఎం.కీర్తి (జనగాం) 14–21, 21–16, 21–14 తేడాతో ఇంటూరి వర్షిత్ శ్రీసాయి (భద్రాద్రి కొత్తగూడెం) – అలీషాఖాన్ (రంగారెడ్డి)పై గెలుపొంది టైటిల్ సాధించారు. టోర్నీ ముగింపు వేడుకల్లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని విజేతలకు ట్రోఫీలను అందజేశారు.

చనిపోయిన ఉద్యోగికి బదిలీ ఉత్తర్వులు

- 11 నెలల క్రితం ఓ వీఆర్ఏను మహబూబ్‌నగర్ మున్సిపాలిటీకి కేటాయింపు
- అనారోగ్యంతో జనవరిలోనే చనిపోయిన సదరు ఉద్యోగి
- 5 నెలల తర్వాత ఓ వీఆర్ఏను జేఏగా సర్దుబాటు చేసిన వైనం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఓ ప్రభుత్వోద్యోగి చనిపోయిన ఐదు నెలల తర్వాత వేరే చోటకు ఉన్నతాధికారులు బదిలీ ఉత్తర్వులు జారీ చేసిన సంఘటన ఇది. వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం ఖాజీపూర్‌కు చెందిన ఆంజనేయులు (37) కొన్నేళ్లుగా రెవెన్యూ శాఖలో వీఆర్ఏగా పనిచేశారు. అయితే ఈ పోస్టులను గత ఏడాది అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. అనంతరం అర్హులైన కొందరిని ఇతర శాఖలలో జూనియర్ అసిస్టెంట్లు (జేఏ)గా సర్దుబాటు చేసింది. దీంతో ఈయనను 2023 ఆగస్టు 10న మహబూబ్‌నగర్ స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీకి ఉన్నతాధికారులు కేటాయించారు. అయితే వివిధ కారణాలతో అధికారికంగా ఉత్తర్వులు మాత్రం ఈ ఏడాది మార్చి 20న అందాయి. ఆ మేరకు అప్పట్లోనే విధుల్లో వార్డు ఆఫీసర్‌గా చేరినా అనారోగ్యం కారణంగా గత జనవరి 28న చనిపోయాడు. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులు వెంటనే ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. కొన్ని రోజులకు ఆయన భార్య యశోద కారుణ్య నియామకం కింద తనకు ఏదైనా ఉద్యోగం ఇవ్వాలని దరఖాస్తు చేసుకుంది. కాగా, తాజాగా ఈనెల 3న సీసీఎల్ఏ హైదరాబాద్ నుంచి వీఆర్ఏల సర్దుబాటు జాబితాలో ఆంజనేయులు పేరు ఉండటం గమనార్హం. వనపర్తిలోని ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ కార్యాలయానికి కేటాస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. ఈ విషయమై మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డిని వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు అప్పట్లో తొమ్మిది మంది వీఆర్ఏలను విధుల్లోకి తీసుకున్నామన్నారు. వారిలో ఆంజనేయులు కూడా ఉన్నాడని, అయితే అనారోగ్య కారణాలతో గత జనవరిలో చనిపోయాడన్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. అనంతరం అతని భార్య కారుణ్య నియామకం కింద ఏదైనా ఉద్యోగం ఇవ్వాలని దరఖాస్తు చేసుకోగా పరిశీస్తున్నామన్నారు. తాజాగా సీసీఎల్ఏ నుంచి సర్దుబాటు చేసిన జాబితాలో అతని పేరు ఎలా వచ్చిందో తెలియదన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలనే హోమం

- కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ


మాట్లాడుతున్న కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ

నాగర్‌కర్నూల్: సమాజంలో ప్రజలు, పశుపక్షాదులు సుభిక్షంగా ఉండాలనే శ్రీకృష్ణ ఆయుత చండీయాగం నిర్వహిస్తున్నట్లు కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ తెలిపారు. పట్టణంలోని ఓంనగర్‌కాలనీ సమీపంలో యాగశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వామీజీ మాట్లాడారు. అత్యంత వైభవోపేతంగా ఆదివారం నుంచి 21వ తేదీ ఆదివారం వరకు 15రోజులపాటు ఆధ్యాత్మికంగా శ్రీకృష్ణ ఆయుతచండీ హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాలచక్రం ఆయుతచండీ అతి రుద్రం, సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం, చతుర్వేద పూర్వక మహాగణపతి మహాసార దర్శన లక్ష్మీనారాయణ సహిత శ్రీమద్ భగవద్గీత 83వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ త్యాగపరితంగా ప్రాంతం సమృద్ధిఇగా ఉంటుందని, వర్షాలు మంచిగా కురిసి పంటలు బాగా పడుతాయని, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతున్నారని వారి సమస్యలు పరిష్కారమై వారి జీవితాల్లో కొత్త ఉత్తేజం నిండుతుందని, ఈ కార్యక్రమాలకు 800 మంది వేద పండితులు హాజరై హోమాలను నిర్వహిస్తారని తెలిపారు. రోజు 400 జంటలు పాల్గొని హోమం నిర్వహించేందుకు కార్యక్రమాలు రూపొందించినట్లు చెప్పారు. ఈ మహోత్సవాలలో లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన, పదివేల పార్థివ లింగాల అర్చన, అమ్మవారికి లక్ష గాజుల సమర్పణ, రాధాకృష్ణ కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తుల కోసం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, రాత్రికి అల్పాహార సౌకర్యం ఉంటుందన్నారు. కుల మతాలకు అతీతంగా ఈ యాగ కార్యక్రమాలకు భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని దిగ్విజయం చేయాలని కోరారు.

పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు

పెద్దకొత్తపల్లి: చెంచుబాలలను పనిలో పెట్టుకున్న ఇద్దరు యజమానులపై కేసు నమోదు చేసినట్లు పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీష్ తెలిపారు. మారేడుమాన్‌దిన్నెకి చెందిన తెలుగు బంగారయ్య పశువుల కాపరిగా చెంచురాముడు 10 సంవత్సరాలు, తెలుగు కృష్ణయ్య యజమాని బాలకృష్ణ 12 సంవత్సరాల చెంచు బాలకార్మికులను పశువుల కాపరులుగా పెట్టుకున్నారు. విషయం తెలుసుకున్న ఆపరేషన్ ముస్కాన్ టెన్ సంస్థ, ఎస్ఐ మాణిక్యనాయక్ తన సిబ్బందితో వెళ్లి బాలకార్మికులతో పని చేయించుకున్న యజమానులకు నచ్చజెప్పి చెంచు బాలకార్మికులైన రాముడు, కృష్ణయ్యలను పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆపరేషన్ ముస్కాన్ టెన్ సంస్థ జూనియర్ అసిస్టెంట్ యాదగిరి స్వామి ఫిర్యాదు మేరకు తెలుగు బంగారయ్య, కృష్ణయ్యలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. చెంచు బాలకార్మికులను ముస్కాన్ సంస్థకు అప్పగించగా.. వారిని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో చదివిస్తామని తీసుకెళ్లారు. లింగయ్య, మల్లేశ్వరి, ఆంజనేయులు, మల్లేశ్వరి ఉన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన శ్రీధర్‌రెడ్డి తల్లిదండ్రులు


కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు లేఖ అందజేస్తున్న శ్రీధర్‌రెడ్డి కుటుంబం

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి మే నెల 3న హత్యకు గురయ్యారు. ఇప్పటి వరకు నిందితులను పట్టుకోవడం లేదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను హైదరాబాద్‌లో శ్రీధర్‌రెడ్డి తల్లిదండ్రులు శనివారం కలిసి వివరించారు. హత్య జరిగి రెండునెలలు గడుస్తున్నా.. కేసులో పురోగతి లేదని, పోలీసులు కావాలనే తాత్సరం చేస్తున్నారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. వారి వెంట బీజేపీ కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు, మాజీ జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు వెంకట్రమణమ్మ, గోవిందు, శ్రీధర్‌రెడ్డి, మధు, రామస్వామి, శివ, సింగిల్‌విండో డైరెక్టర్ డేగ శేఖర్ తదితరులు ఉన్నారు.

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు


కల్వకుర్తిలో బెల్లం, కారును స్వాధీనం చేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు

కల్వకుర్తిరూరల్: సారా తయారీ, విక్రయాలను అడ్డుకునేందుకు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో శనివారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. 1,800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడంతో పాటు, 40 కేజీల బెల్లం, 15 కేజీల పటిక స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో ఏడు కేసులు నమోదు చేసి, నలుగురిని అరెస్ట్ చేయడంతో పాటు 26 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి కోట్ర చౌరస్తా వద్ద నిర్వహించిన రూట్‌వాచ్‌లో హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు వాహనంలో 19 బస్తాలలో 570 కేజీల నల్లబెల్లం అచ్చంపేట బొల్గాట్‌పల్లితండాకు తరలిస్తుండగా పట్టుకున్నారు. ముడావత్ శివను అరెస్ట్ చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. కల్వకుర్తి ఎక్సైజ్ సిబ్బందితోపాటు స్టేట్ టాస్క్‌ఫోర్స్ హైదరాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లా టాస్క్‌ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

జడ్చర్ల: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో శనివారం బెల్లం, నవసాగ్రం పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం ముకిడిగూడెంకు శ్రీశైలం అనే వ్యక్తి వాహనంలో దాదాపు 1,500 కిలోల బెల్లం, 50 కిలోల పటికను తరలిస్తుండగా జడ్చర్ల ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద పట్టుకున్నారు. తనిఖీలలో సీఐలు బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శారద, ఎస్ఐ సృజన్ సిబ్బంది పాల్గొన్నారు.

జోగులాంబ సన్నిధిలో రైల్వే డీఆర్‌ఎం



అలంపూర్ రూరల్: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను శనివారం రైల్వే డీఆర్‌ఎం విష్ణు సతీ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చక స్వాములు స్వాగతం పలికారు. స్వామి, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రాణం తీసిన దాహం

కాలుజారి బావిలో పడి బాలుడి మృతి


మల్లేష్(ఫైల్)

గట్టు: దాహం తీర్చుకునేందుకు బావిలోకి దిగి, కాలుజారి నీటిలో పడిపోవడంతో ఈత రాక బాలుడు మృతిచెందిన సంఘటన గట్టు మండలం పెంచికలపాడులో చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పెంచికలపాడుకు చెందిన తాతమనవడు గొర్రెలను కాసేందుకు శనివారం అడవికి వెళ్లారు. మధ్యాహ్నం మనవడికి ఆకలి వేయడంతో గొర్రెల మంద వద్ద తాతను కాపలాగా ఉంచాడు. వెంట తెచ్చుకున్న సద్ది మూటను బావి గట్టున విప్పి మల్లేష్(మనవడు) భోజనం చేశాడు. భోజనం పూర్తయిన తర్వాత దాహం తీర్చుకునేందుకు బావిలోకి దిగాడు. కాలు జారి బావిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. మనవడు ఎంతకూ రాకపోవడంతో తాత చుట్టు పక్కల వెతికి బావి వద్దకు వెళ్లి చూశాడు. బావిలో వెతికి చూసి మల్లేష్‌ను బయటకు తీశారు. అప్పటికే బాలుడు మృతిచెందినట్లు గుర్తించారు. ఈ సంఘటనతో పెంచికలపాడులో విషాదం నెలకొంది.

కోనేరు పూడ్చివేతపై భక్తుల ఆగ్రహం

- కారకులపై చర్యలకు డిమాండ్
- పునరుద్ధరణకు అధికారుల హామీ


రంగనాయకస్వామి గుట్టపై పూడ్చివేసిన గుండాన్ని పరిశీలిస్తున్న భక్తులు

జడ్చర్ల: బాదేపల్లిలోని రంగనాయకస్వామి పెద్దగుట్టపై ఉన్న కోనేరు (గుండం) పూడ్చివేతపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గుండం పూడ్చివేసినట్లు శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు చక్కర్లు కొట్టాయి. దీంతో వెంటనే ఆలయ ధర్మకర్తగా చెప్పుకొంటున్న పట్టణానికి చెందిన రవితేజగౌడ్ ఆలయానికి వాస్తుదోషం ఉందని.. ఆగమ శాస్త్ర పండితుల సూచనల మేరకు గుండం, మెట్లను తొలగించినట్లు ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఏకపక్షంగా శతాబ్దాల చరిత్ర ఉన్న గుండం, మెట్ల తొలగింపు నిర్ణయం ఎలా తీసుకుంటారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా వందలాది మంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. గుండం పూడ్చివేతను ఎంతమాత్రం ఉపేక్షించబోమని.. యథాతథంగా గుండం, మెట్లు పునరుద్ధరించాలని అధికారులు, పోలీసులను డిమాండ్ చేశారు.

గుప్తనిధుల కోసమేనా..?

గుప్తనిధుల కోసం గుండంలో తవ్వకాలు జరిపారని.. శ్రావణ మాసంలో ఆలయానికి వచ్చిన భక్తులు తవ్వకాలపై ప్రశ్నిస్తారని భావించి అభివృద్ధి పేరిట పూడ్చివేశారని భక్తులు మండిపడ్డారు.

కమిటీ ఏర్పాటుకు సన్నాహాలు..

ఆలయ అభివృద్ధికి కమిటీ వేయాలని భక్తులు నిర్ణయించారు. ధర్మకర్తగా రవితేజగౌడ్ చెప్పుకోవడం తగదని ఎవరూ నియమించలేదన్నారు. కాగా 2019లో ఆలయ అర్చక, మేనేజింగ్ ట్రస్టీగా దేవాదాయశాఖ తమను గుర్తించిందని పేర్కొంటూ రవితేజ సీఐకి ఉత్తర్వులు అందజేశారు.

పునరుద్ధరణకు చర్యలు..

సీఐ ఆదిరెడ్డి రవితేజను అదుపులోకి తీసుకొని వెంటనే హిటాచీతో గుండం పునరుద్ధరణ పనులు ప్రారంభించినా.. వర్షం కారణంగా నిలిపివేశారు. త్వరలోనే పునరుద్ధరిస్తామని సీఐ తెలిపారు.

కేసు నమోదు..

కోనేరు (గుండం) పూడ్చివేతకు సంబంధించి స్థానిక పాతబజార్‌కు చెందిన రవితేజగౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని సీఐ ఆదిరెడ్డి తెలిపారు. స్థానికులు, దేవాదాయశాఖ అధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారం కోనేరు తవ్వి మట్టితో పూడ్చారని.. హిందూ సమాజ మనోభావాలను దెబ్బతీశారని అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు వివరించారు.

'గుండం పూడ్చివేత తగదు'

రంగనాయకస్వామి పెద్దగుట్టపై సహజసిద్ధంగా వెలసిన గుండం పూడ్చివేత తగదని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శనివారం ఎస్పీ జానకి దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు చెప్పారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న భక్తులు

భారీ బందోబస్తు..

వందలాది మంది భక్తులు శనివారం స్థానిక పాతబజార్ ఆంజనేయస్వామి ఆలయంలో సమావేశమయ్యారు. అక్కడి నుంచి రంగనాయకస్వామి గుట్టపైకి వెళ్లేందుకు బయలుదేరారు. అయితే గుట్టపైకి పోలీసులు వాహనాలను అనుమతించకపోవడంతో కాలినడకన చేరుకొని పూడ్చిన గుండాన్ని పరిశీలించి అక్కడే సమావేశం ఏర్పాటు చేసుకొని కార్యాచరణపై చర్చలు జరిపారు. తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐలు చంద్రమోహన్, శివానందంగౌడ్ తదితరులు అక్కడికి చేరుకొని విచారించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న భక్తులు గుండం పూడ్చివేత కారకులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

జీవన విధానానికి మార్గదర్శకం భగవద్గీత

జడ్చర్ల టౌన్: సనాతన ధర్మం కాపాడుతూ, మానవుడు ఎలా జీవించాలో నేర్పించేది భగవద్గీత అని జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన రచయిత ఉమ్మెంతల మహేశ్వర్ రచించిన మద్భగవద్గీత సుధ గ్రంథాన్ని శనివారం జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో గంగాపురం మళయాళ లక్ష్మీనారాయణ ఆశ్రమ నిర్వాహకులు పరమాత్మనందగిరి ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన కసిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలు కాపాడటాన్ని భగవద్గీత నేర్పిస్తుందన్నారు. భగవద్గీతను ప్రతి ఒక్కరు ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ గీతలోని శ్లోకాలను పరిరక్షించుకోవాలని.. అలాంటి బాధ్యతలో ఉమ్మెంతల మహేశ్వర్ ముందున్నారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్, ఆశ్రమ స్వామి అమృతానందగిరి, వెంకట్ చర్, పరిషత్ మండల అధ్యక్షురాలు చిగుళ్లపల్లి పద్మలీల, సభ్యులు కిరణ్మయి, గోనెల రాధాకృష్ణ, విఠలయ్య, ప్రాణేశ్వరాచారి పాల్గొన్నారు.


మద్భగవద్గీత సుధ గ్రంథం ఆవిష్కరిస్తున్న పరమాత్మనందగిరి

వైభవంగా సీతారాముల కల్యాణం



ఎర్రవల్లిచౌరస్తా: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని బీచుపల్లి కోదండరామ స్వామి ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు భువనచంద్ర, దత్తుస్వాముల ఆధ్వర్యంలో సీతారాముల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి.. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిదాల మధ్య కల్యాణ వేడుక కమనీయంగా సాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు పాల్గొన్నారు.